సాక్షి తిరుపతి

ఆదివారం । 20 । జూలై । 2025



ఇంటర్ స్పాట్ అడ్మిషన్లపై నిర్లక్ష్యం

టీటీడీ జూనియర్ కళాశాల్లలో మూడు విడతల ప్రవేశాలు ముగిసినా స్పాట్ అడ్మిషన్లపై జాప్యం నెలకొంది.

- 8లో



నీచపు వ్యాఖ్యలు ఖండిస్తూ నిరసన

మాజీ మంత్రి రోజానుద్దేశించి ఎమ్మెల్యే భానుప్రకాష్ చేసిన నీచపు వాఖ్యలపై నిరసన చేపట్టారు.

- 8లో

శ్రీవారి భక్తులకు గాయాలు



తిరుపతి–పీలేరు రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీవారి భక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

శేష వాహనంపై కుమారస్వామి



పుర విహారానికి బయలుదేరుతున్న కుమారస్వామి

శ్రీకాళహస్తి : శ్రీవల్లీ, దేవసేన సమేత కుమారస్వామి శనివారం యాళి వాహనంపై ఊరేగారు. శ్రీకాళహస్తిలో ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని కుమారస్వామి, అమ్మవార్లను ఆలయ అలంకార మండపంలో అభిషేకాలు నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, మేళ తాళాల మధ్య స్వామి, అమ్మవార్లను యాళి వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి శనివారం రాత్రి శేష వాహనంపై ఊరేగారు.

సీఎం చంద్రబాబుకు సాదర స్వాగతం



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్

రేణిగుంట : తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం శనివారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అధికార యంత్రాంగం సాదరంగా స్వాగతం పలికింది. విమానాశ్రయ వెలుపల పార్టీ కార్యకర్తలు, ప్రజల నుంచి సీఎం అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, డీఐజీ షిమోషి బాచ్ పాయ్, జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశ, ఎమ్మెల్యేలు ఆరని శ్రీనివాసులు, ఆదిమూలం, నెలవల విజయశ్రీ , పాశం సునీల్ కుమార్, భానుప్రకాష్, కె.రామకృష్ణ, మురళి, సుధీర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, తదితర అధికారులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

జగన్ విజన్ భళా!

'ఆధ్యాత్మిక నగరం పరిశుభ్రంగా ఉండాలి.. తిరునగరి ఖ్యాతి దశదిశలా ఇనుమడించాలి.. స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో ఆధిపత్యాన్ని చాటాలి.. జాతీయ స్థాయిలో తిరుపతి పరపతి మరింత పెరగాలి.. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను వంద శాతం అమలుచేయాలి.. తద్వారా రెడ్యూస్.. రీయూస్.. రీసైకిల్ విధానాన్ని పక్కాగా అమలు చేసి స్వచ్ఛ మహా యజ్ఞంలో తిరుగులేని శక్తిగా ఆవిష్కరించాలి..' అన్న సంకల్పంతో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తూకివాకంలోని ఇంటిగ్రేటెడ్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను అభివృద్ధి చేశారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సీఎం చంద్రబాబు ఆ ప్లాంటును సందర్శించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్లాంట్ నిర్మాణాలపై ఆరా తీశారు. అప్పటి సీఎం జగన్ విజనరీని మెచ్చుకున్నారు. చప్పట్లు కొట్టి అభినందించారు.

- ఇంటిగ్రేటెడ్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ చూసి ఆశ్చర్యం వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు
- ప్రైవేట్ పబ్లిక్ పార్టనర్‌షిప్ పద్ధతిలో గత ప్రభుత్వం గ్రీన్‌సిటీ అభివృద్ధి
- దేశంలో ఎక్కడా లేని విధంగా చెత్త నుంచి సంపద తయారీ
- ప్రాజెక్టుల ఏర్పాటుపై ఆరా తీసిన ముఖ్యమంత్రి



తూకివాకం వద్ద వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అభివృద్ధిచేసిన ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్

తిరుపతిలో ఉత్పత్తయ్యే చెత్త	210	టన్నులు
తడి చెత్త	90	టన్నులు
పొడి చెత్త	120	టన్నులు
శానిటేషన్ నిర్వహిస్తున్న సిబ్బంది	920	మంది

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సాధించిన ర్యాంకులు

సంవత్సరం	సాధించిన ర్యాంక్
2017	9
2018	6
2019	8
2020	6
2021	రద్దు
2022	1 (ప్రెసిడెంట్ అవార్డు)
2023	1
2024	రద్దు
2025	సూపర్ స్వచ్ఛ లీగ్ అవార్డు

తిరుపతి తుడా : నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను గత ప్రభుత్వం అనుసరించి రాష్ట్ర వ్యాప్తంగా ఆయా నగరాల్లో ఉత్పత్తయ్యే చెత్తను వంద శాతం సద్వినియోగం చేసేందుకు చర్యలు చేపట్టింది. దీన్ని మహా యజ్ఞంగా భావించి రెడ్యూజ్, రీయూజ్, రీసైకిల్ విధానాన్ని అమలుచేసింది. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా చెత్త నిర్వహణను పక్కాగా అమలుచేసి దేశం తిరుపతి వైపు చూసేలా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే స్వచ్ఛ సర్వేక్షణ్ అమలుచేస్తున్న నగరాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణలో తిరుపతి అగ్రస్థానంగా నిలిచింది. అప్పటి అధికారులు చిత్తశుద్ధితో పీపీపీ పద్ధతిలో ప్లాంటును యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి అమల్లోకి తీసుకొచ్చారు. చెత్త ద్వారా సంపదను సృష్టించే విధానం తిరుపతి నుంచే మొదలైంది.

తూకివాకం గ్రీన్‌సిటీలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాజెక్టులు




ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ పనితీరును పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

2019లో బయో మెథనైజేషన్ ప్లాంటును మహేంద్ర అండ్ మహేంద్ర కంపెనీతో తిరుపతి నగర పాలక సంస్థ ఎంఓయూ (ఒప్పందం) కుదుర్చుకుంది. తిరుపతి నగరంలో ఉత్పత్తి అయ్యే తడి చెత్త, ఫుడ్ వేస్ట్ ద్వారా గ్యాస్‌ను ఉత్పత్తి చేసి విక్రయించుకునేందుకు అనుమతించారు. మున్సిపల్ కార్పొరేషన్ తూకివాకంలో రెండెకరాల స్థలాన్ని మాత్రమే ఆ కంపెనీకి అప్పగించింది. రూ.18 కోట్లు వెచ్చించి బయో మెథనైజేషన్ ప్లాంటును అభివృద్ధి చేసి నగరంలో ఉత్పత్తయ్యే తడి చెత్తను పూర్తి స్థాయిలో ఎరువులుగా తయారుచేస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్లాంట్‌ను బ్లూ ప్లానెట్ సంస్థ నిర్వహిస్తోంది.

వ్యర్థ నీటి శుద్ధిలో రెండవ నగరం

తిరుపతి నగరంలో వెలువడే డ్రైనేజీ వ్యర్థాలను శుద్ధి చేసే కేంద్రం 1980లో ప్రారంభించారు. 50 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును స్వయంగా మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తోంది. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యర్థాలు సామర్థ్యానికి మించి వెలువడుతోంది. 2020లో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా వాటర్ ప్లస్ విధానానికి శ్రీకారం చుట్టారు. స్మార్ట్ సిటీ నిధుల నుంచి రూ.32 కోట్లు వెచ్చించి 25 ఎమ్ఎల్డీ నీటి శుద్ధి కేంద్రాన్ని రెండేళ్ల పాటు శ్రమించి అభివృద్ధి చేశారు. ఆధునిక టెక్నాలజీతో మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ శుద్ధి చేసిన నీటిని ప్రైవేటు కంపెనీలకు విక్రయించడంతో పాటు చుట్టు పక్కల రైతులకు ఉచితంగా సరఫరా చేస్తున్నారు. ఇలా చెత్తను 100 శాతం రిలీజ్ చేసేందుకు నాటి ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో పనిచేసింది.



మురుగు నీటి శుద్ధి కేంద్రం



డ్రైవేస్ట్ ప్లాంట్‌లో వ్యర్థాల విభజన

2021లోనే చెత్త నుంచి సంపద

పొడి చెత్త నుంచి సంపద సృష్టించే దిశగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ 2021లో అడుగులు వేసింది. ప్రతి కిలో పొడి చెత్త నుంచి రూ.2 ఆదాయాన్ని పొందుతున్న నగరంగా తిరుపతి దేశంలో తొలి సిటీగా నిలిచింది. నెలకు రూ.10 లక్షల మేర ఆదాయం లభిస్తోంది.

ఎరువుల తయారీ

నగరంలో ఉత్పత్తి అయ్యే వెట్ వేస్ట్ ద్వారా సేంద్రియ ఎరువుల తయారీకి 2020లో శ్రీకారం చుట్టారు. తడి చెత్త నిర్వహణను ఎన్జీఓ సంస్థకు అప్పగించారు. డీ కంపోజర్ చేసి తద్వారా ఎరువులు తయారు చేసి రైతులకు నామ మాత్రపు ధరలతో విక్రయించే విధానం తిరుపతి నుంచే మొదలైంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు నిర్వహణ ఆగిపోయింది.

సిమెంటు ఇటుకల తయారీ

సీ అండ్ డీ (కన్‌స్ట్రక్షన్ అండ్ డెమోలిష్) ప్రాజెక్టును పీపీపీ పద్ధతి ద్వారా ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. 2020లో రూ.14 కోట్లు ఖర్చుచేసి భవన వ్యర్థాల ద్వారా సిగ్రిగేషన్ ప్రక్రియను ప్రారంభించారు. భవన వ్యర్థాల్లోని ఇసుక, కంకర, ఐరన్‌ను వేరు చేయడం, తద్వారా వెలువడిన ఇసుక సన్నని కంకర ద్వారా ఫుట్ పాత్‌కు ఉపయోగించే సిమెంట్ ఇటుకల తయారీ రోడ్ల నిర్మాణంలో ఉపయోగించుకునేందుకు అవసరమైన మెటీరియల్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. నగరంలో వెలువడే భవన వ్యర్థాలను 100 శాతం సిగ్రిగేషన్(విభజన) చేయాలనే సంకల్పంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.

ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు ఆరా

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉత్పత్తయ్యే చెత్తను రెడ్యూస్, రీయూస్ రీసైక్లింగ్ చేస్తున్న విధానంపై సీఎం చంద్రబాబు సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ ప్రాజెక్టులు ఎప్పుడు కట్టారు? ఎంత ఖర్చు చేశారు? అని ఆరా తీశారు. ఈ ప్రాజెక్టులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధిచేశారని చెప్పడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇంత అభివృద్ధి గురించి తనకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని వాకబు చేశారు. ప్లాంట్ల నిర్వహణ బాగుందని ప్రశంసించారు. బయో మెథనైజేషన్ ప్లాంటుకు చంద్రబాబు 2018లో ఎంఓయూ కుదుర్చుకుని ఆపై విస్మరించారు. తిరిగి 2019లో మహేంద్ర కంపెనీతో ఒప్పందం కుదిరి ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయించేందుకు నాటి పాలకులు, అధికారులు ఎంతో శ్రమించారు. మిగిలిన ప్రాజెక్టులను 2019–24 మధ్య ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటిపై ఆరా తీసి వ్యర్థాల నిర్వహణపై సీఎం సంతృప్తి వ్యక్తంచేసి అధికారులను అభినందించారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శుల నియామకం



సత్యనారాయణరెడ్డి



బీరేంద్రవర్మ



ఓడూరు గిరిధర్‌రెడ్డి



కోడూరు కల్పలతారెడ్డి

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు (పార్లమెంటు)గా డి.బీరేంద్రవర్మ (సత్యవేడు), ఓడూరు గిరిధర్‌రెడ్డి (నాయుడుపేట), కోడూరు కల్పలతారెడ్డి (గూడూరు)ని నియమిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలను వీరికి కేటాయించినట్లు తెలిపింది. పార్టీ కేంద్ర కార్యాలయంతో వీరు సమన్వయం చేసుకుంటూ సంబంధిత రీజనల్ కో–ఆర్డినేటర్లు, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులకు సహాయకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. అదే విధంగా తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి నెల్లూరు పార్లమెంటుకు రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా అధినేతకు కృతజ్ఞతలు తెలిపారు.

యూపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు



పరీక్షల నిర్వహణపై అబ్జర్వర్ శైలేష్ గౌతమ్‌తో కలిసి సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్వో

తిరుపతి రూరల్ : యూపీఎస్సీ కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేశామని, అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు భద్రతను ఉంచినట్లు జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు వెల్లడించారు. ఆదివారం తిరుపతి కేంద్రంగా జరిగే పరీక్షా కేంద్రాలు, అక్కడ చేపట్టిన భద్రతా చర్యలపై శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో యూపీఎస్సీ అబ్జర్వర్ శైలేష్‌గౌతమ్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. తిరుపతి జిల్లాలోని 3 పరీక్ష కేంద్రాలలో 1,052 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించే ఇన్విజిలేటర్లు, లైజన్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఉదయం 09:30 గంటల నుంచి 11:30 గంటల వరకు పేపర్ –1, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పేపర్–2 పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతి ఒక్క అభ్యర్థి తప్పనిసరిగా గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని లేకపోతే పరీక్ష కేంద్రానికి అనుమతించబోమని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్దకు ఆర్టీసీ సౌకర్యం, కేంద్రాల వద్ద సౌకర్యాలు , విద్యుత్తు అంతరాయం లేకుండా సంబంధిత శాఖల అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పరీక్షా కేంద్రాల వివరాలు

తిరుపతి నగరంలోని బాలాజీ కాలనీ నుంచి వెస్ట్ చర్చికి వెళ్లే దారిలో ఉన్న శ్రీ పద్మావతి బాలికల ఉన్నత పాఠశాల, శ్రీ పద్మావతీ గెస్ట్ హౌస్ నుంచి రైల్వే ట్రాక్ దాటుకుని వెళ్లే మార్గంలోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కాలేజీ, శ్రీ పద్మావతీ జూనియర్ కాలేజీలను పరీక్ష కేంద్రాలుగా అధికారులు నిర్దేశించారు. పరీక్ష నిర్వహించే ఆ ప్రాంతంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసులు హెచ్చరించారు.

మిథున్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం

- ఎంపీ అరెస్ట్‌పై పెల్లుబికిన నిరసన
- మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబాన్ని టార్గెట్ చేయడం దుర్మార్గం
- కూటమి ప్రభుత్వం జనాగ్రహానికి గురికాక తప్పదు

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌పై చిత్తూరు, తిరుపతి జిల్లాల ప్రజలు మండిపడుతున్నారు. లిక్కర్ స్కామ్ కేసులో ఆయన్ను శనివారం రాత్రి సిట్ అధికారులు అరెస్ట్ చేయడంపై ధ్వజమెత్తుతున్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబాన్ని అణగదొక్కడానికే మిథున్‌రెడ్డిని విరికించారని విరుచుకుపడుతున్నారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని చూసి కూటమి ప్రభుత్వం వణికి పోతోందని తెలిపారు. అందుకనే అక్రమ కేసులు బనాయించి, లిక్కర్ స్కామ్ కేసులో విరికించి భయపెట్టాలని చూస్తోందని ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచి తీరుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని స్పష్టం చేశారు.

– పుంగనూరు / పలమనేరు / కాణిపాకం

ఎంపీ అరెస్ట్ కక్ష పూరితం



ఈ రాష్ట్ర ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. రాష్ట్ర ప్రజలను భయపెట్టాలని చూస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో దాడులు ఎక్కువయ్యాయి. అరాచకాలకు పాల్పడుతోంది. అవినీతి, అక్రమాలు తారస్థాయికి చేరుకున్నాయి. వీటిని ప్రశ్నించే గొంతు నొక్కేస్తోంది. అడ్డొచ్చే ప్రతిఒక్కరినీ అణగదొక్కుతోంది. కుట్ర పూరితంగా తప్పుడు కేసులు బనాయిస్తోంది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు నేతలను అరెస్ట్ చేయగా..రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని కూడా అరెస్ట్ చేసింది. ఇది ముమ్మాటికీ దారుణం. పగబట్టి ప్రతీకారం తీర్చుకుంది. ఈ ప్రభుత్వం ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా వైఎస్సార్‌సీపీని, మిథున్‌రెడ్డి ఏం చేయలేరు. మిథున్‌రెడ్డి అరెస్టును మేము తీవ్రంగా ఖండిస్తున్నాం.

– సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు

అక్కసుతోనే అక్రమ అరెస్ట్





ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్కసుతోనే లిక్కర్ కేసు నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే తీవ్ర ప్రజావ్యతిరేకత ఏర్పడింది. అదే సమయంలో వైఎస్సార్ సీపీకి విశేష ఆదరణ లభిస్తోంది. దీన్ని చూసి కూటమి నేతలు తట్టుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో లిక్కర్ కేసులో ఇరికించారు. ఏడు కేసుల్లో బెయిల్‌పై ఉన్న చంద్రబాబు వరుసబెట్టి వైఎస్సార్ సీపీ నాయకులపై కేసులు పెట్టిస్తున్నారు. ఇలాంటి తప్పుడు కేసులకు వైఎస్సార్ సీపీ నాయకులు భయపడే ప్రసక్తేలేదు.

– పవిత్ర, వైఎస్సార్‌సీపీ విశ్వబ్రాహ్మణ విభాగం అధ్యక్షురాలు, బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, మురళీకృష్ణ, రాష్ట్ర కార్యదర్శులు

ప్రజలకు సేవ చేయడం నేరమా?



నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేయడమే పెద్దిరెడ్డి కుటుంబం చేసిన నేరమా..?. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి పై తప్పుడు కేసులు బనాయించి అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నాం. ఇలా తప్పుడు కేసులు బనాయించే వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారు. –మాగడి సల్మా, హ్యూమన్ రైట్స్ జిల్లా ఉపాధ్యక్షురాలు, పుంగనూరు

తిరుగుబాటు తప్పదు



రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిపై తప్పుడు కేసులు బనాయించి అరెస్ట్ చేయడం అక్రమం. తప్పుడు కేసులు పెట్టి పెద్దిరెడ్డి కుటుంబాన్ని అణచివేయలేరు. పెద్దిరెడ్డి కుటుంబంపై కేసులు బనాయిస్తే తిరుగుబాటు ఉద్యమం తప్పదు.

– కిషోర్, వ్యాపారి, పుంగనూరు

బాధాకరం



పెద్దిరెడ్డి కుటుంబం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, ఆయనకున్న ప్రజాభిమానాన్ని చూసి సహించలేక పోతున్నారు. అందుకనే ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేశారు. ఇది చాలా బాధాకరం. ప్రజా సేవ చేసే వారిని ఇలాంటి కేసులు ఏమీ చేయలేవు.

– ఆసిఫ్, మైనార్టీ యువకుడు

కేసులు కాదు...అభివృద్ధి చేయండి



పుంగనూరు నియోజకవర్గాన్ని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఎంతో అభివృద్ధి చేశారు. ప్రభుత్వానికి చేతనైతే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలే తప్ప.. ఇలా అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడం ఎంతవరకు కరెక్ట్.

– యాసిన్, మైనార్టీ యువకుడు, పుంగనూరు

పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఢీకొనలేక..



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ముగ్గురూ ఎన్నికల్లో గెలవడంపై కూటమి ప్రభుత్వం జీర్ణించుకోలేక పోయింది. ఎలాగైనా పెద్దిరెడ్డి ఆదిపత్యాన్ని తగ్గించేందుకు మిథున్ రెడ్డిపై తప్పుడు కేసులు బనాయించించింది. దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే.

– అజీజ్‌సాహెబ్, ముతవల్లి, పుంగనూరు

అధికార మదంతో అణచివేస్తారా?



పెద్దిరెడ్డి కుటుంబం ఎదుగుదలను చూసి ఓర్వలేక పోతున్నారు. అందుకనే అధికార మదంతో అణచివేయడానికి ఒడిగట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా పెద్దిరెడ్డి కుటుంబాన్ని ప్రజల నుంచి విడదీయలేరు. తప్పుడు కేసులు బనాయిస్తే కూటమి ప్రభుత్వం జనాగ్రహానికి గురికాక తప్పదు. అక్రమ కేసులు ఆపండి.

– పి.అయూబ్‌ఖాన్, రైతు, పుంగనూరు

అక్టోబరు 15 వరకు ప్రత్యేక రైళ్ల పొడిగింపు

- తిరుపతి, మదురై, నాగర్‌సోల్ వెళ్లే వారికి అనుకూలం
- రూట్ షెడ్యూల్ ప్రకటించిన రైల్వేశాఖ



తిరుపతి రైల్వేస్టేషన్ (ఫైల్)

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : తెలుగు రాష్ట్రాల మీదుగా ప్రయాణిస్తున్న 54 ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వేశాఖ అధికారులు తెలిపారు. ప్రధాన మార్గాల్లో కొనసాగుతున్న రద్దీకి అనుగుణంగా పొడిగింపు చేపట్టినట్టు పేర్కొన్నారు. ఈ రైళ్లు తిరుపతి, మదురై, నాగర్ సోల్‌కు వెళ్లే వారికి అనుకూలంగా ఉంటాయని వెల్లడించారు. కాచిగూడ–మదురై మార్గంలో 07191/07192 నంబర్లు కలిగిన ప్రత్యేక రైళ్లు, హైదరాబాద్–కొల్లాం మార్గంలో 07193/07194, హైదరాబాద్–కన్యాకుమారి మార్గంలో 07230/07239 రెళ్లను పొడిగించారు. అదే విధంగా సికింద్రాబాద్–తిరుపతి మధ్య 10, కాచిగూడ–నాగర్‌సోల్ మధ్య 8, నాందేడ్–తిరుపతి మధ్య 10, నాందేడ్–ధర్మవరం మధ్య 10 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల మీదుగా ఆరు ప్రధాన మార్గాల్లో నడుస్తున్న 54 ప్రత్యేక రైళ్లను అక్టోబర్ 15వ తేదీ వరకు పొడిగించారు.

మదురై - కాచిగూడ మధ్య ప్రత్యేక రైళ్లు

మదురై–కాచిగూడ స్పెషల్ ట్రైన్ ఆగస్టు 20వ తేదీ నుంచి అక్టోబర్ 15 వరకు ప్రతి బుధవారమూ ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. 07193/07194 నంబర్ కలిగిన రెండు స్పెషల్ రైళ్లు హైదరాబాద్– కొల్లం మధ్య రాకపోకలు సాగిస్తున్నాయి. హైదరాబాద్ నుంచి కొల్లం వెళ్లే ఈ స్పెషల్ రైళ్లు ఆగస్టు 16 నుంచి అక్టోబర్ 11వ తేదీ వరకు ప్రతి శనివారమూ ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. 07230/07229 నంబర్ గల రెండు రైళ్లు హైదరాబాద్–కన్యాకుమారి మధ్య రాకపోకలు సాగిస్తాయి. 07229 నంబర్ కలిగిన హైదరాబాద్–కన్యాకుమారి స్పెషల్ రైలు ఆగస్టు 13 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు ప్రతి బుధవారమూ నడుస్తుంది.

క్లుప్తంగా

మద్యం మత్తులో కత్తితో దాడి

తిరుపతి క్రైం : ఇద్దరు టీ మాస్టర్ల మధ్య గొడవ జరిగిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ సీఐ రామయ్య తెలిపిన వివరాల మేరకు.. జయశంకర్‌నగర్‌లో పుట్టపర్తి జిల్లా ధర్మవరానికి చెందిన వేణుగోపాల్ (28), నేపాల్‌కు చెందిన సుమన్ ఇద్దరూ కలిసి టీ షాప్‌లో మాస్టర్లుగా పనిచేస్తున్నారు. అయితే వీరు ఇరువురు ఒకే రూంలో ఉంటున్నారు. శుక్రవారం రాత్రి వీరు పీకల్లోతు మద్యం తాగి గొడవ పడ్డారు. ఈ క్రమంలో వేణుగోపాల్ పై సుమన్ కత్తితో దాడి చేయడంతో వేణుగోపాల్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వేణుగోపాల్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. కేవలం చిన్నపాటి గొడవలే అతడిని హత్య చేసేందుకు సుమన్ సిద్ధమైనట్లుగా ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు అన్నారు. దీనిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోతి దాడిలో బాలికకు గాయాలు


గాయపడిన బాలిక

శ్రీకాళహస్తి: కోతి దాడిలో బాలిక గాయపడిన సంఘటన శనివారం శ్రీకాళహస్తి మండలం ఉడమలపాడు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నిహిత అనే చిన్నారి ఇంటి ఆవరణలో ఆడుకుంటోంది. అదే సమయంలో ఒక కోతి అక్కడికి వచ్చి ఉన్నట్టుండి బాలికపై దాడి చేసింది. గాయపడిన చిన్నారిని తల్లిదండ్రులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో పలుమార్లు కోతులు దాడులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేతన బకాయిలు విడుదల

తిరుపతి సిటీ : ఎస్వీయూలో పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లకు 2024-25 అకడమిక్ సంవత్సరానికి సంబంధించి 15 రోజుల వేతన బకాయిలను అందించేందుకు వర్సిటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 2025-26కు సంబంధించి అకడమిక్ కన్సల్టెంట్ల అర్హత జాబితాను ఈసీ సమావేశం నిర్వహించి ఆమోద ముద్ర పొందిన తర్వాత రెన్యూవల్ చేయనున్నట్లు సమాచారం.

ఆటో దహనంపై ఫిర్యాదు


పాక్షికంగా కాలిన ఆటో

చిల్లకూరు : మండలంలోని వల్లిపేడు గ్రామంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తన ఆటోను తగుల బెట్టినట్లు యజమాని విక్రమ్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసారు. వివరాలు.. ఆటో తోలుకుంటూ విక్రమ్ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో ఆటోలో తాటి ఆకుల కట్టలను లోడ్ చేసుకుని ఇంటి బయట పార్క్ చేశారు. వేకువజామునే మరో గ్రామానికి ఆకులను తరలించాల్సి ఉంది. అయితే తాటి ఆకులకు ఎవరో నిప్పు పెట్టడంతో ఆటో పాక్షికంగా కాలిపోయింది. దీంతో సుమారు రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

డిగ్రీ.. ప్రవేశాలు

డిగ్రీ అడ్మిషన్లపై విద్యార్థులకు ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. ఇంటర్ పాసై 4 నెలలు గడుస్తున్నా అడ్మిషన్లు చేపట్టడంలో ఉన్నత విద్యా మండలి నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఫలితంగా వేల మంది విద్యార్థుల భవిష్యత్తు అయోమయంగా మారింది. మొన్నటి వరకు డబుల్ మేజర్ అంటూ పాట పడిన ప్రభుత్వం..మళ్లీ గత ప్రభుత్వం అవలంబించిన సింగిల్ మేజర్ విధానమే అంటూ కళాశాలలు దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ప్రవేశాలు మరింత ఆలస్యం అయ్యే సూచనలు కనిపిస్తుండడంతో విద్యార్థులు నిరాశకు లోనవుతున్నారు.



దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ అంటూ హంగామా

- ఓపెన్ కాని ఓఏఎమ్‌డీసీ వెబ్‌సైట్
- దరఖాస్తు ఎలా చేయాలో అర్థం కాక విద్యార్థులు సతమతం
- అయోమయంలో కళాశాలల అధ్యాపకులు
- సింగిల్ మేజర్ కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటూ కళాశాలలకు ఉత్తర్వులు
- మళ్లీ మొదటికొచ్చిన వ్యవహారం.. ఆగస్టులోనే నోటిఫికేషన్
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ఉన్నత విద్యామండలి

తిరుపతి సిటీ : ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడి నాలుగు నెలలు కావస్తున్నా డిగ్రీ అడ్మిషన్లు చేపట్టడంలో ఉన్నత విద్యామండలి విఫలమైంది. విద్యార్థి సంఘాలు, మేధావులు, విద్యావంతుల ఒత్తిడి తాళలేక ఎట్టకేలకు డిగ్రీ దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ అంటూ హంగామా చేసి రెండు రోజుల క్రితం ప్రవేశాలకు ప్రకటన విడుదల చేసింది. కానీ ఇప్పటి వరకు ఆన్‌లైన్ అడ్మిషన్స్ మోడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఓఏఎమ్‌డీసీ) వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అడ్మిషన్ల విధానంపై స్పష్టత లేకుండా ప్రకటన విడుదల చేసిన ఉన్నత విద్యామండలి వ్యవహార శైలిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో సుమారు 30 వేల మంది విద్యార్థులు డిగ్రీలో ప్రవేశాల కోసం నాలుగు నెలలుగా ఎదురు చూస్తున్నా ప్రభుత్వంలో చలనం రాలేదు. డ్యుయల్ మేజర్ అంటూ అనవసర రాద్ధాంతం చేసి కమిటీ నివేదిక రావాలంటూ మూడు నెలలు కాలయాపన చేసిన ఉన్నత విద్యామండలి చివరకు చేతులెత్తేసింది. గత ప్రభుత్వం అవలంబించిన సింగిల్ మేజర్ సబ్జెక్టుతోనే అడ్మిషన్లు చేపట్టడమే ఉత్తమమని భావించి ఎట్టకేలకు ప్రకటన చేసింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ విద్యార్థి ఆధార్ కార్డుతో దరఖాస్తు చేసుకోవాలంటూ ప్రగల్భాలు పలికింది. ఓఏఎమ్‌డీసీ వెబ్‌సైట్‌లో అన్ని వివరాలు పొందిపరిచామంటూ ప్రకటన చేసిన ఉన్నత విద్యామండలి అడ్మిషన్ల నిబంధనలపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఏమి చేయాలో పాలుపోలేని స్థితిలో విద్యార్థులు, తల్లిదండ్రులు కళాశాలల చుట్టూ తిరుగుతున్నారు.

అడ్మిషన్లపై ప్రభావం

జిల్లాలోని ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇక డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ మరింత ఆలస్యమవుతోందని గ్రహించి ఇంజినీరింగ్ కళాశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఈ ఏడాది జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో భారీ స్థాయిలో అడ్మిషన్లు పడిపోయే ప్రమాదం ఉంది.

ఓపెన్ కాని వెబ్‌సైట్ ..

ఉన్నత విద్యామండలి అడ్మిషన్లకు అనుమతులు జారీ చేసినట్లు ప్రకటించినా ఓఏఎమ్‌డీసీ వెబ్‌సైట్ ఇప్పటి వరకు తెరుచుకోకపోవడం గమనార్హం. దీంతో డిగ్రీ కళాశాలల అధికారులు, అధ్యాపకులు అయోమయంలో పడ్డారు. వెబ్‌సైట్ ఓపెన్ అయితేగాని ప్రవేశాలపై స్పష్టత రాదని తేల్చి చెబుతున్నారు. తమకే స్పష్టత లేనప్పుడు విద్యార్థులకు ఏమని సలహా ఇస్తామని అధ్యాపకులు చెబుతున్నారు.

జిల్లాలో డిగ్రీ కళాశాల సమాచారం

ప్రభుత్వ కళాశాలలు	17
ప్రైవేటు డిగ్రీ కళాశాలలు	104
టీటీడీ డిగ్రీ కళాశాలలు	5
ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలైన తేదీ	ఏప్రిల్ 12
అడ్మిషన్ల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు	30 వేల మంది
గతేడాది ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు	51 శాతం
ప్రైవేటు కళాశాలలో అడ్మిషన్లు సరాసరి	62 శాతం
30శాతంలోపు అడ్మిషన్లు జరిగిన ప్రభుత్వ కళాశాలలు	11
సింగిల్ డిజిట్ ప్రవేశాలకు పరిమితమైన కోర్సులు	9

ఆగస్టు ఫస్ట్ వీక్‌లో నోటిఫికేషన్?

ఉన్నత విద్యా మండలి డిగ్రీలో డ్యుయల్ మేజర్ విధానం కష్టతరమని భావించి విరమించుకుంది. గత ప్రభుత్వం అవలంబించిన సింగిల్ మేజర్ విధానాన్ని కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు ఈనెల 31వ తేదీలోపు సింగిల్ మేజర్ విధానం కోసం ఉన్నత విద్యామండలికి దరఖాస్తు చేసుకోవాలని శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఆగస్టు మొదటి వారంలో ఇవ్వనున్నట్లు సమాచారం.

విద్యా వ్యవస్థ ఆగమాగం



కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను సర్వనాశనం చేసింది. ఇంటర్ ఫలితాలు వెలువడి నాలుగు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు ప్రవేశాలు చేపట్టకుండా కాలయాపన చేసి జీవితాలతో చెలగాటం ఆడటం దారుణం. ఈ ఏడాది డిగ్రీ కళాశాలలో కనీసం 40 శాతం కూడా ప్రవేశాలు పెరిగే పరిస్థితి లేదు.
– భార్గవ్ సాయి, జైభారత్ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు, తిరుపతి

అంతా తికమకగా ఉంది



డిగ్రీ అడ్మిషన్లపై ఉన్నత విద్యామండలి చేసిన ప్రకటన తికమకగా ఉంది. ప్రవేశాలు ఆన్‌లైన్ అంటూ మళ్లీ ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు చేసుకోవాలంటూ ప్రకటించింది. కనీసం వెబ్‌సైట్ ఇప్పటి వరకు ఓపెన్ కాలేదు. దీంతో మా తల్లిదండ్రులు ఇంజినీరింగ్ చేర్పిస్తామంటున్నారు. ప్రవేశాలు ఆలస్యం కావడంతో బీటెక్‌లో జాయిన్ అవుతున్నా. – శ్రావణి ప్రియ, విద్యార్థి, తిరుపతి

అధ్యాపకులకే అర్థం కావడం లేదు



డిగ్రీ ప్రవేశాల విధి విధానాలపై స్పష్టత ఇవ్వకపోవడంతో కళాశాల అధ్యాపకులకు సైతం అర్థం కావడం లేదు. ఇప్పటికే పలుమార్లు డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియపై ఆరా తీశాం. వెబ్‌సైట్ తెరుచుకుంటే కానీ తమకే స్పష్టత లేదని అధ్యాపకులు చెబుతున్నారు. –విజయశ్రీ, విద్యార్థిని, తిరుపతి

అధికారులపై చర్యలు తీసుకోవాలి



డిగ్రీ అడ్మిషన్లను అస్తవ్యస్తం చేసిన ఉన్నత విద్యామండలి అధికారులపై చర్యలు తీసుకోవాలి. డబుల్ మేజర్ , సింగిల్ అంటూ మూడు నెలలు కాలయాపన చేశారు. ఇప్పుడు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ అంటూ అయోమయానికి గురి చేస్తున్నారు. – బండి చలపతి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, తిరుపతి

విద్యార్థుల జీవితాలతో చెలగాటం



రాష్ట్ర చరిత్రలో డిగ్రీ ప్రవేశాలు జాప్యం కావడం ఇదే తొలిసారి. ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోంది. ఉన్నత విద్యా మండలి అధికారులు రెండు రోజుల క్రితం ఇచ్చిన ప్రకటన అయోమయంగా ఉంది.
– భగత్ రవి, ఎస్ఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి

రెండు ఆటోలు ఢీ : ఒకరి మృతి


ప్రమాదానికి గురైన ఆటో


అశోక్ మృతదేహం


క్షతగాత్రులు

- 8 మందికి గాయాలు

నాయుడుపేటటౌన్ : మండలంలోని పండ్లూరు సమీపంలో శనివారం రెండు ఆటోలు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో 8 మంది గాయపడ్డారు. వివరాలు.. గూడూరుకు చెందిన మదనంబేడు కామేశ్వరావు, కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఆటోలో దైవ దర్శనం కోసం శ్రీకాళహస్తికి బయలు దేరారు. పండ్లూరు వద్ద ఎదురుగా వస్తున్న మరో ఆటో వేగంగా ఢీకొంది. దీంతో కామేశ్వరావు, గౌతమి, ఉష రాణి, శశికుమారి, మరో నలుగురు గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన ఆటో నడుపుతున్న తుపాకుల అశోక్ (22)ను 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మరణించాడు. అతిగా మద్యం తాగి ఆటో నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు సీఐ బాబీ వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో శ్రీవారి భక్తులకు గాయాలు

భాకరాపేట : తిరుపతి-పీలేరు జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీవారి భక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన శ్రీనివాసరెడ్డి కుటుంబం తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో వారు ప్రయాణిస్తున్న కారు చిన్నగొట్టిగల్లు మండలం రాజువారిపల్లె సమీపంలోని మంజుల దాభా సమీపంలో డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనతో కారులో ప్రయాణిస్తున్న శ్రీనివాసరెడ్డి, భువన, మోహన్‌రెడ్డి, శ్వేత, సాయిక్రిష్, కేతన్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే పని చేస్తున్న జాతీయ రహదారి కార్మికులు కారులో ఇరుక్కుపోయిన క్షతగాత్రులను బయటికు తీశారు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో రెండు అంబులెన్స్‌ల్లో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు భాకరాపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటర్ స్పాట్ అడ్మిషన్లపై నిర్లక్ష్యం

తిరుపతి సిటీ : టీటీడీ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మూడు విడతల ప్రవేశాల ప్రక్రియ ముగిసి దాదాపు 25 రోజులు పూర్తి కావస్తున్నా మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. ఈనెల 14న స్పాట్ అడ్మిషన్లు చేపట్టాల్సి ఉండగా టీటీడీ అధికారుల నిర్లక్ష్య ధోరణితో వాయిదా పడింది. వాయిదా వేయడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, అటు కళాశాల సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయలసీమ జిల్లాల నుంచి పలువురు తల్లిదండ్రులు ప్రతిరోజు వ్యయ ప్రయాసల కోర్చి కళాశాలల అధ్యాపకుల చుట్టూ తిరుగుతున్నారు. వాయిదా వ్యవహారంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ముఖ్య నేతల ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీడబ్ల్యూ జూనియర్ కళాశాల, ఎస్వీ జూనియర్ కళాశాల, ఎస్వీ బధిర కళాశాలల్లో ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు కాస్త డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. రాష్ట్ర స్థాయి మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులతో అధికారులకు కాస్త తలనొప్పిగా మారినట్లు సమాచారం. దీంతో ఎవరికి ఎన్ని సీట్లు కేటాయించాలనే విషయంపై కళాశాల, టీటీడీ అధికారులు తర్జన భర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. వచ్చే వారంలోపు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది.

ఎల్ఈ ప్రవేశాలపై నిరాసక్తత

తిరుపతి సిటీ : పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సులలో లేటరల్ ఎంట్రీ (ఎల్ఈ)తో నేరుగా ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలకు అభ్యర్థులు మొగ్గు చూపడం లేదు. దీంతో జిల్లాలోని ఐదు ప్రభుత్వ, ఒక టీటీడీ మహిళా పాలిటెక్నిక్ కళాశాలల్లో భారీ స్థాయిలో సీట్లు మిగిలిపోయాయి. తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాల కేంద్రంగా ఎల్ఈ ప్రవేశాలకు శనివారం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేశారు. దీంతో తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎల్ఈ అడ్మిషన్లు కాస్త మెరుగా ఉన్నా మిగిలిన కళాశాలలో పరిస్థితి సింగిల్ డిజిట్‌లకే పరిమితమయ్యాయి. సత్యవేడు, పుత్తూరు, చంద్రగిరి, గూడూరు కళాశాలలో జీరో అడ్మిషన్లు జరిగినట్లు సమాచారం. ఒక్కో బ్రాంచికి సంబంధించి గరిష్టంగా 66 సీట్లు ఉంటాయి, ఇందులో ఆరు సీట్లు ఇంటర్ వృత్తి విద్య చదివిన అభ్యర్థులకు, మరో ఆరు సీట్లు ఐటీఐ అభ్యర్థులకు కేటాయిస్తారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వరకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 73,093 మంది స్వామిని దర్శించుకున్నారు. 31,570 మంది భక్తులు తలనీలాలు ఇచ్చారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.21 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తు లకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వ దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

నీచపు వ్యాఖ్యలు ఖండిస్తూ నిరసన

నగరి : మహిళను కించపరచడం దేశ సంస్కృతిని కించపరచడమే అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా నేతలు పేర్కొన్నారు. మాజీ మంత్రి ఆర్కే రోజానుద్దేశించి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేసిన నీచపు వాఖ్యలను ఖండిస్తూ వారు శనివారం దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళా నాయకురాళ్లు మాట్లాడుతూ మాజీ మంత్రి ఆర్కే రోజాపై టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమన్నారు. దుష్ట సంస్కృతికి ఈ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయన్నారు. అలాంటిది రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒక సారి మంత్రిగా, నటిగా ఉన్న ఆర్కే రోజా లాంటి మహిళకే గౌరవం లేకుంటే ఇక సాధారణ మహిళల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తక్షణం ఎమ్మెల్యే భానుపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ మహిళా అధ్యక్షులు అముద, మున్సిపల్ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, కౌన్సిలర్లు చినపాప, సాయి సంధ్యారాణి, మున్సిపల్ మహిళా కార్యదర్శి తేన్‌మొళి, రూరల్ మండల మహిళా అధ్యక్షురాలు మాబూనిషా, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, పట్టణ పార్టీ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, రూరల్ పార్టీ అధ్యక్షులు తిరుమలరెడ్డి, నేతవి భాగం అధ్యక్షులు బాలకృష్ణ పాల్గొన్నారు.